

సి. హెచ్. శాంతాదేవి

సన్నగా వర్షపుజల్లు పడుతోంది.

రైలువచ్చి వెళ్ళిన సూచనగా స్టేషన్ నిర్మానుష్యంగా వుంది. .... కాంతారావు నెమ్మదిగా సిగరెట్టు కాల్చుకుంటూ ఆ చివర్నుంచి ఈ చివరకు నడుచుకుంటూ వస్తున్నాడు.

అతనో స్నేహితుణ్ణి పంపించటానికి వచ్చాడు.

చూరుల్లోంచి వర్షపునీరు ధారగా కారుతోంది. కాంతారావు తలకివున్న మఫ్లరు మరి కాస్త చెవులమీదికి లాక్కుంటూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

నడుస్తున్నవాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు. కొద్ది దూరంలో ఒక బెంచీ మీద చిన్నపిల్లవాణ్ణి ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఓ స్త్రీ కూచునివుంది. ఆమె వయసు మహావుంటే పాతికేళ్ళుంటాయేమో? తన పమిటచెంగు పిల్లవాడిచుట్టూ కప్పి కూర్చునివుంది.

అది పరమసామాన్యమైన విషయమే అయినా ఆ స్త్రీ కూచున్న తీరులోనే ఏదో అపసవ్యం వున్నట్టు లీలగా గోచరించింది.

అతను సిగరెట్టు విసిరిపారేసి ఒక్క క్షణం నిలబడిపోయాడు. స్టేషన్‌మాస్టరు బెంచీమీద కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. అక్కడక్కడా కూలీలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

కాంతారావు స్తంభాన్ని ఆనుకుని అలాగే నిలబడ్డాడు. ఆ మనిషి కదలలేదు. అలాగే తలవంచుకుని కూర్చునివుంది.

ఇప్పుడు వచ్చే ట్రెయిన్లేమీ లేవు. ఆ అమ్మాయి ఎవరికోసం నిరీక్షిస్తున్నట్లు?....

కాంతారావు మరో సిగరెట్టు వెలిగించాడు.

ఆ అమ్మాయి అతనివైపు చూసే అవకాశంలేదు. ఎందుకంటే తను నిలబడిన

చోటంతా చీకటిగా వుంది. ఆ అమ్మాయి కూచున్న బెంచీ వెనక ఎలక్ట్రిసిటీ బల్బుంది.

అందుకని ఆ పరిసరాలన్నీ స్పష్టంగా కనబడుతున్నాయి. రాత్రి పదిగంటలు దాటే వుంటుంది.

ఇప్పుడు వచ్చే రైలేమీ లేదు.

ఆ అమ్మాయి ఎవరో గానీ ఎవరితోనూ తనకేమీ పట్టనట్టు ఎటూ చూడకుండా మౌనంగా కూచునివుంది.

కాంతారావుకి కుతూహలంగా వుంది. వయసులోవున్న స్త్రీ. ఒంటరిగా కన బడితే సహజంగా కలిగే కుతూహలం అది....

ఆమె దగ్గరకు వెళ్ళి సంగతి సంద ర్భాలు కనుక్కుందామా అని ఆలోచిస్తు న్నాడు. మళ్ళీ వెనక్కి తగ్గుతున్నాడు.

ఆమె ఎవరో, ఏమిటో.....

ఎవరైనా గొప్పింటిస్త్రీ అయితే అదో లేనిపోని తంటా....

సిగరెట్టు అయిపోయి వేళ్ళని చురు క్కున కాల్చింది. కాంతారావు మళ్ళీ ఆమెకేసి దృష్టినిల్పాడు.

ఇంటికి వెళ్ళిపోదామా అన్పించిందో క్షణం. మనసు ఆగమని హెచ్చరించింది. ఆ మనిషి వ్యవహారమేమిటో తేల్చు కుని వెళ్ళమని లోపలెక్కడో అన్పి స్తోంది. పైకిమాత్రం ఆ మనిషి ఎవ రైతే తనకెందుకు, ఎందుకిక్కడుందో? కారణం ఏమిటో? తనకేమిటి అవసరం అనుకుంటున్నాడు. నిమిషాలు నెమ్మదిగా నడుస్తున్నాయి.

కాంతారావు ఏదైతే అదే అవుతుందని సిగరెట్టు కాలికింద పడేసి నలిపి ఆర్పే శాడు.

నెమ్మదిగా ముందుకు నడిచాడు.

ఆ అమ్మాయి కూచున్న బెంచీకి ఓ అడుగు దూరంలో నిలబడ్డాడు.

మనిషి అలికిడి పసిగట్టి ఆమె ఒరగా తలెత్తిచూసింది. అతనికా అవకాశం చాలును.

"రైలుకి వెళ్లాలి మీరు. మద్రాసుకు వెళ్లే బండి ఇంతకుముందే వెళ్లింది. తెల్లవారి నాలుగ్గంటలకి గానీ ప్యాసింజరు లేదు."

అతనికి లోపలెక్కడో భయంగానే వుంది. తను తొందర పడుతున్నాడేమో!, ఆ మనిషి తలెత్తి అతనివంక చూసింది. వళ్లో పిల్లాడు కదిలాడు.

ఆమె వైఖరి చూస్తుంటే అతన్లో మినుకు మినుకుమంటున్న అనుమానం క్రమంగా పెరగసాగింది.

"ఎక్కడికి వెళ్లాలి?" మరి కాస్త చను వుగా అడిగాడు.

ఆమె తల అడ్డంగా వూపింది.

అతనికి అర్థంగాలేదు.

ఆమె ఏం చెప్పదల్చుకుంది?

ఆ పిల్లవాడు నెమ్మదిగా మంచిపీళ్ల కావాలని సైగ చేస్తున్నాడు. కాంతారావు వెంటనే, "నేను పట్టించుకొస్తాను. బాబు

నివ్వండి." అంటూ ఆమె జవాబుకి ఎదురు చూడకుండా బాబుని తీసుకున్నాడు.

అతను వాణ్ణెత్తుకుని పంపు దగ్గరకు తీసికెళ్ళి నీళ్ళు పట్టాడు. ఆమె ఏం మాట్లాడకుండా చూస్తోంది.

అతను తిరిగివస్తూ దారిలో అనేక ప్రశ్నలు వేశాడు కుర్రవాణ్ని. అతను ఒక్కదానికి జవాబు చెప్పలేదు.

అతనికంటేముందే పరిచివెళ్ళి తల్లిని చేరుకున్నాడు. అతను ఆమె బెంచీ పక్కగా ఎంతసేపు నిలబడ్డా ఆమె మాట్లాడలేదు. తనతో సంభాషణ పెంచటం ఆమె కిష్టంలేదని గ్రహించాడతను.

మరో మెట్టు పైకి వెళ్ళాడు.

"మీరు ఒంటరిగా వున్నట్టున్నారు. ఇప్పటికే చాలా పొద్దుపోయింది. ఇక్కడి పరిసరాలు కూడా అంత మంచివి గాదు." చుట్టూ గమనిస్తూ అన్నాడు.

ఆమె అతనివంక చూసింది. పిల్లవాణ్ణి మరికాస్త దగ్గరకు తీసుకుంది.

అతనికి చాలా ధైర్యం కలిగింది ఆ క్షణంలో.

"మీ కెవరూ లేరా!"

ఆమె తల అడ్డంగా తిప్పింది.

"ఎక్కడికి వెళ్ళాలని?"

అతను చాలా సింపాదిగా అడిగినట్టడిగాడు గానీ, మనసులో ఆమె దిక్కులేనిదనీ, వయసులోవున్న ఆడదీ అన్న భావం పదేపదే గుర్తుకు వస్తోంది.

హఠాత్తుగా ఆమె చీరకొంగు మొహానికి అడ్డం పెట్టుకుని నిశ్శబ్దంగా ఏడవసాగింది.

అతను కంగారుపడ్డాడు, చుట్టూ చూశాడు. ఎవరూ తమని గమనించటంలేదు.

బెంచీ మీద ఆమె పక్కగా కూర్చున్నాడు.

"విచారించి లాభంలేదు. ముందు సంగతి ఆలోచించాలి" ఆమె క్షేమం కోరేవాడిలా అన్నాడు.

"ఎవరూ లేనిదాన్ని. చేసుకున్నవాడు పట్నంలో మరోదాన్ని మరిగి నన్ను వదిలేశాడు. అనాదే ఏ నుయ్యో, గొయ్యో చూసుకునేదాన్ని. ఈ పిల్లాడికోసం బతికివున్నాను." అందామె వెక్కుతూ.

"అదీ కథ" అనుకున్నాడు కాంతారావు.

"ఈ వూళ్ళో మీ కెవరూ లేరా?" అన్నాడు ముందుజాగ్రత్తగా.

ఆమె మళ్ళీ తల అడ్డంగా వూపింది.

"ఎక్కడయినా ముష్టడుక్కుంటే పిల్లాడూ, నేనూ బతకాలి. అంతకు తప్పితే మరో మార్గం లేదు."

"పిచ్చిదానా! అది నువ్వనుకున్నంత తేలికనుకుంటున్నావా! వయసులోవున్న ఒంటరి ఆడదానికి భద్రత వుందా ఈ లోకంలో...."

ఆమె ఆలోచించింది. అతనన్నది నిజమే! ఆమెకి ఈ లోకంలో మగవాళ్ళంతా క్రూరులుగానూ, వంచకులుగానూ కనిపించారు. లోకం తెలీని ఆమె

కళ్ళకి కాంతారావు — దేవుడిలా కన్పించాడు. ఆ మనసు ఇలాగే [illegible] వాలి అనుకుంటూ [illegible]

"నన్నేం చేయమంటారు?" దీనంగా ప్రశ్నించింది.

కాంతారావు ఒక్క క్షణం భయపడ్డ మాట నిజమే. అయితే పీక్కుపోయినా ఆమెలో ప్రతిఫలించే యౌవనకాంతి, ఒంపుసొంపులూ అతనిలో భయాన్ని పారద్రోలాయి.

"నీకేం భయంలేదు. నీ కేదో దారి నేను చూస్తాను." అన్నాడు అభయమిస్తున్నట్టు.

ఆమె సంతోషంగా చూసింది అతని వంక.

"మీకు ఎవరూ లేరా?"

కాంతారావు ఒక క్షణం ఆగి;

"లేకేం వున్నారు! పద మరి వర్షం వచ్చేట్టువుంది." ఆమెను ఇంటికి తీసుకు వెళ్ళాడు.

ఇంట్లో పళ్ళూ, బ్రెడ్డూ వుంటే యిచ్చి తల్లినీ, పిల్లవాణ్ణీ తినమన్నాడు.

అతను అంతకుమించి చొరవ తీసుకోదల్చుకోలేదు ఆ రాత్రి.

మర్నాడు ఉదయం అతను లేచేసరికి ఆ అమ్మాయి పిల్లవాణ్ణి దగ్గర కూర్చోబెట్టుకుని కన్నీళ్ళు కారుస్తోంది.

కాంతారావు కుర్రవాణ్ణి దగ్గరకు పిల్చాడు.

ఆ పిల్లాడు భయపడుతూ తల్లిచాటుకు వెళ్ళాడు.

"ఇలా రా, నీ పేరేమిటి?"

వాడు మాట్లాడకుండా అలాగే చూస్తున్నాడు.

"బళ్ళోకెళ్ళి చదువుకుంటావా? పుస్తకాలు కొనిపెడతాను."

వాడు దిగులుగా తల్లివంక చూశాడు.

ఆ తల్లి కన్నీళ్ళతో—

"పిల్లాడు మూగవాడు" అంది.

కాంతారావుకి ఒక్క క్షణం కడుపులో కెలికినట్టయింది. ఆ అమ్మాయి మొహంలోకి చూళ్ళేక తల తిప్పుకున్నాడు.

....ఆ వీధిలోవారంతా అప్పటికే చెవులు కొరుక్కోసాగారు ఈ కొత్త మనిషి ఎవరన్నట్టు?

కాంతారావు అందరికీ నచ్చచెప్పాడు. ఎవరో దిక్కులేని మనిషనీ, పనీ, పాటా చూసుకుంటూ పడివుంటుందనీ నమ్మకంగా చెప్పాడు.

....ఆ రాత్రి పిల్లాడు నిద్రపోయిం తర్వాత ఆమెను గదిలోకి పిల్చాడు.

ఆమెకు చాలాసేపు ధైర్యం చెప్పాడు. పిల్లాడి బాగోగులు తను చూస్తానని నమ్మకం కలిగేలా చెప్పాడు.

సావిత్రి అతన్ని నమ్మింది.

నమ్మితీరాలి. దిక్కులేని ఆడది అందర్నీ నమ్మాలి. నమ్మక ఈ ప్రపంచంలో నెగ్గుకు రాలేదు.




సావిత్రి అలాగే నమ్మింది కాంతారావుని.

రెండురోజులు కులాసాగా గడిచాయి.

మూడోనాడు ఉపద్రవం ముంచుకొచ్చింది.

పుట్టింటినుండి భార్య వస్తున్నట్టు ఉత్తరం వచ్చింది.

కాంతారావుకి గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. అసలు ఈ మనిషిని ఏం చెయ్యాలని తీసుకొచ్చాడు? ఎక్కడైనా నాలుగిళ్ళల్లో పనిచేసుకుంటూ బ్రతుకుతుందనుకున్నాడు గానీ ఇలా తనని అంటిపెట్టుకు పోతుందనుకోలేదు. ఎలా దీన్ని వదుల్చుకోవటం?

అతనికేం చెయ్యాలో తోచలేదు. అప్పటికే ఇరుగుపొరుగు ఆడంగులు చేరి నవ్వులు మొదలెట్టారు.

"అసలు దాన్ని పనిలోకి తెచ్చాడా, పక్కలోకి తెచ్చుకున్నాడా?" అంటూ ఊహాగానాలు చెయ్యసాగారు.

వేరే ఇల్లు చూసి సావిత్రిని అందులో వుండాలని నిర్ణయించుకున్నాడు కాంతారావు.

"నన్ను ఒంటరిగా వదిలేస్తారా" అంటూ ఏడిచింది. కాంతారావుకు చిరాకు పుట్టింది. జానకి వచ్చిందంటే ఇంట్లో యుద్ధం లేవదీస్తుంది.

సావిత్రిని ఒప్పించి ఆమెను వేరే యింట్లో పెట్టాడు. అతనికి తను చేసిన తప్పు చాలా త్వరగా తెలిసివచ్చింది. రెండురోజులు సరదాగా గడపవచ్చును కున్నాడు గానీ, ఆ మనిషి తనకి గుదిబండలా తయారవుతుం దనుకోలేదు. తను పెళ్ళయి సంఘంలో పెద్దమనిషిగా చలామణీ అవుతున్న తను ఈ నీతి, జాతి లేని మనిషిని జీవితాంతం పోషిస్తానని మాట యిచ్చాడా?

....జానకి ఊళ్ళోకి వచ్చి రావటమే తడవుగా కాంతారావు చేసిన ఘనకార్యం

చిలవలూ, పలవలుగా వర్ణించి ఆమె చెవిలో వేశారు ఇరుగుపొరుగులంతా. ఆమె మొగుణ్ని నిలదీసింది.

కాంతారావు తన తప్పు ఒప్పుకున్నాడు. ఇకపై మరి జీవితంలో ఆమె మొహం చూడనని ఒట్టేసుకున్నాడు.

"ఏదో చాపల్యంవల్ల తొందరపడ్డానే గానీ నే నెవరూ, నా స్థితి ఏమిటి?" అన్నాడు గర్వంగా భార్యతో.

జానకి తృప్తిపడి ఊరుకుంది.

తర్వాత కథ చెప్పుకోవలసింది గాదు.

ఈ లోకంలో ప్రతి ఆడదానికి జరిగే అన్యాయమే సావిత్రికీ జరిగింది.

ఆమె వేరేయింట్లోకి మారింతర్వాత మొదట్లో రాత్రిపూట వచ్చేవాడు భార్యకి తెలియకుండా. కానీ అది రానురాను కష్టమైపోయింది. ఆలోచించగా దిక్కుమాలిన సావిత్రికోసం అగ్నిసాక్షిగా తాళి గట్టిన భార్యను వదులుకోవటం ఆమెతో పేచీపెట్టుకోవటం అతని కిష్టంలేకపోయింది. అతననుకున్నది నిజమే! జానకిని వదిలేస్తే లోకులు కాకుల్లా పొడుస్తారు. నీతిలేనివాడినని నిందిస్తారు. కుక్క ముట్టిన కుండకోసం పవిత్రమూర్తి అయిన అర్ధాంగిని వదిలేస్తావా అని బహిష్కరిస్తారు....

సావిత్రి సంగతా?....

ఆమె సంగతి ఏముంది?

ఆమెకు నా అన్నవాళ్ళెవరూ లేరు. ఇలా చేశావేమని అడిగే దిక్కు లేదు. ఆమెకు జరిగిన అన్యాయానికి బాధపడే వారెవరూ లేరు కాంతారావుని నిలదీసి ప్రశ్నించేవారూ లేరు. ఆమెను వదియేట్లో నావలా వదిలేసినా లోకం బాధపడదు. పైగా ఆమెనే నిందిస్తుంది. కందకావరంతో బలిసి బరితెగించినందుకు శిక్ష అనుభవించాల్సిందే నంటుంది.

కాంతారావుకి ఏ మాలిన్యమూ అంటదు. అతను పెద్దమనిషి. పరువూ, ప్రతిష్ఠా కలవాడు. అన్నిటికన్నా ముఖ్యంగా అతను మగవాడు.

నోరులేని భగవంతుణ్ని చేతులెత్తి ప్రార్థించింది సావిత్రి....

"నా కెవరు దిక్కు?"

